## పారదర్శకంగా పోటీలు నిర్వహించాలి : డీఈవో

మాట్లాడుతున్న డీఈవో రాజేందర్

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 24 : ఎస్‌జీఎఫ్ మండల స్థాయి ఎంపిక పోటీలను పారదర్శకంగా సెప్టెంబర్ 15 వరకు నిర్వహించాలని డీఈవో రాజేందర్ అన్నారు. శనివారం భూపాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి పీడీ, పీఈటీల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక పోటీల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ క్రీడల నిర్వహణ బాధ్యతలను భూపాలపల్లి జిల్లా క్రీడా కార్యదర్శి శిరంగి రమేశ్‌కు అప్పగించారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడల నిర్వహణ బాధ్యతలను మండలంలోని సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులకు అప్పగించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ క్రీడల ఎంపిక పోటీలను పక్షపాత వైఖరి ప్రదర్శించకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సెప్టెంబర్ చివరి వరకు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించాలని సూచించారు. ఎస్‌వో రాజగోపాల్, భూపాలపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎన్ ప్రసన్నలక్ష్మి, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ శిరంగి రమేశ్, పీడీలు విజిత, రాజయ్య, జైపాల్, ప్రతాప్, లింగమూర్తి, సాంబమూర్తి, విజయలక్ష్మి, స్వరూపారాణి, ఆనంద్, సాంబరాజు, పృథ్వీరాజ్, సురేశ్, రఘు, సరస్వతి, పూర్ణిమ, జ్యోతి, మమత, సందీప్, శ్రీనివాస్, వీరన్న పాల్గొన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : ఎస్పీ కిరణ్ ఖరే

కెమెరాల పనితీరును అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 24 : జిల్లాలో జన సంచారం గల ప్రదేశాల్లో తప్పకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్, మెడికల్ కాలేజీతో పాటు పలు ప్రాంతాలను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను అదుపులో ఉంచవచ్చన్నారు. నేరస్తులను గుర్తించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో కమాండ్ అండ్ కంట్రోల్ ద్వారా 24 గంటలు పర్యవేక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అదుపు తప్పి కారు బోల్తా

ప్రమాదానికి గురైన కారు

ములుగురూరల్, ఆగస్టు 24 : కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటన ములుగు మండలంలోని గట్టమ్మ సమీపంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం. ఏటూరునాగారం నుంచి టాటా టియాగో ఈవీ కారులో ఓ యువతీ, యువకుడు వస్తుండగా గట్టమ్మ ఆలయం దాటిన తర్వాత కెనాల్ వైపు నుంచి గొర్రెల మంద ఒక్కసారిగా కారుకు అడ్డు వచ్చింది. వాటిని తప్పించేందుకు చేసిన ప్రయత్నంలో కారు అదుపు తప్పి సుమారు 100 మీటర్ల దూరం గాలిలో ఎగిరి వెళ్లి పెద్ద బండరాయికి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కాగా, యువతీ, యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

# గవర్నర్ పర్యటనకు ఏర్పాట్లు చేయాలి

భూపాలపల్లి : మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ ,

గోవిందరావుపేట : అధికారులతో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్

భూపాలపల్లి రూరల్/గోవిందరావుపేట, ఆగస్టు 24: గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 27న సాయంత్రం 3 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గనపురం మండలం కోటగుళ్ల గణపేశ్వరాలయానికి వస్తున్నారన్నారు. పర్యటన ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అధికారులు వారి కేటాయించిన విధులను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వీఐపీల ప్రొటోకాల్ పాటించాలన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పటిష్ట పోలీస్ బందోబస్తు ఉంటుందని, విధు లు నిర్వహించే సిబ్బంది తప్పని సరిగా పాసులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీపీవో నారాయణరావు, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సీపీవో శామ్యూల్, విద్యుత్ శాఖ ఎస్ఈ మల్సూర్, డీఎస్పీ సంపత్‌రావు పాల్గొన్నారు. అలాగే, ములుగు జిల్లా లక్నవరం వద్ద గవర్నర్ పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ టీఎస్ దివాకర పరిశీలించారు. లక్నవరం సరస్సు ఐలాండ్‌ను గవర్నర్ సందర్శించనున్న నేపథ్యంలో సుందరీకరణ పనులను ముమ్మరం చేయాలని సూచించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, మహేందర్‌జీ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ సభ్యులు

ములుగురూరల్ : రాష్ట్ర గవర్నర్, రెడ్‌క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు జిష్ణుదేవ్‌వర్మ ఈ నెల 27వ తేదీన ములుగు జిల్లాలో పర్యటిస్తున్న సందర్భంగా జిల్లా రెడ్‌క్రాస్ సభ్యులు శనివారం కలెక్టర్ టీఎస్ దివాకరను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ ద్వారా జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లా చైర్మన్, డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, సభ్యులు ప్రసాద్, శ్రీనివాస్, రమేశ్, రాజిరెడ్డి, ఈశ్వర్, మహిపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## వాసుదేవరెడ్డిని ఆశీర్వదించిన కేసీఆర్

కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కేతిరెడ్డి వాసుదేవరెడ్డి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 23 : రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి తన పుట్టినరోజు సందర్భంగా శనివారం గజ్వేల్‌లోని వ్యవసాయ క్షేత్రంలో మాజీ సీఎం కేసీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు.

## డ్యూటీ చేయకున్నా వేతనం?

కన్నాయిగూడెం, ఆగస్టు 24 : మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు ఈ విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి పాఠశాలకు రాని విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, ఆ ఉపాధ్యాయుడు ఒక్కరోజు డ్యూటీ చేయకున్నా నెలనెలా జీతం అందుతున్నట్లు తెలుస్తున్నది. ఉపాధ్యాయుడు అర్జియా శనివారం వరకు పాఠశాలకు రాలేదు. మెడికల్ లీవ్ ఉంటే తీసుకొని వచ్చిన తర్వాత మాత్రమే జీతం చేసే అవకాశం ఉంటుంది. ఇప్పటివరకు ఓసీఎల్ వేస్తున్నట్లు హెచ్‌ఎం సమ్మక్క తెలిపారు. దీనిపై పూర్తి సమాచారం కోసం ఎంఈవో రాజేశ్, ముప్పనపల్లి కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌కు పలుమార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు. డీఈవో పాణిని ఫోన్ ద్వారా సంప్రదించగా సదరు ఉపాధ్యాయుడికి జీతం పడ్డట్లుగా తెలిసిందన్నారు. పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకొని, రికవరీ చేస్తామని చెప్పారు.

## వైద్యులు నిబంధనలు పాటించాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 24 : ప్రైవేట్ దవాఖానల వైద్యులు ప్రభుత్వ నిబంధనలను తప్పకుండా పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ప్రైవేట్ దవాఖానలు పాటించాల్సిన నిబంధనలపై జిల్లాలోని అన్ని ప్రైవేట్ దవాఖానల వైద్యులు, వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రైవేట్ దవాఖానలు వైద్య సేవలకు వసూలు చేసే ధరల పట్టిక, వైద్య సిబ్బంది వివరాలు, టెస్టుల వివరాలు ప్రదర్శించాలని ఆదేశించారు. ఐఈసీ ద్వారా అందించే పోస్టర్‌ను దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి రోగికి సంబంధించిన వివరాలు కేసు షీట్‌లో నమోదు చేయాలన్నారు. ప్రసూతి, చిన్నారుల వైద్య సేవల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీజనల్ వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసి, నివేదికలను ప్రభుత్వానికి అందించాలని తెలిపారు. ప్రత్యేక బృందంతో తనిఖీలు నిర్వహిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఎంహెచ్‌వో మధుసూదన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హక్కుల రికార్డుల చట్టంపై చర్చావేదిక

ములుగురూరల్, ఆగస్టు 24 : ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి అధ్యక్షతన నూతన ప్రతిపాదిత తెలంగాణ హక్కుల రికార్డుల చట్టం–2024పై చర్చ వేదికను నిర్వహించారు. ఈ చర్చా వేదికలో న్యాయవాదులు, పాత్రికేయులు, విద్యావేత్తలు, మేధావులు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు. ముందుగా తహసీల్దార్ విజయ్‌భాస్కర్ రెవెన్యూ శాఖలో భూములకు సంబంధించిన పలు అంశాలు, శాఖా పరంగా తాము చేపట్టే చర్యలు, రిజిస్ట్రేషన్ వివరాలను వివరించారు. ఈ మేరకు పలువురు న్యాయవాదులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నూతన చట్టాల్లో కొన్ని అంశాలను చేర్చాలని సూచించారు. అనంతరం కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాలు పాల్గొని పలువురు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, సూచనలపై చర్చించారు. నూతన తెలంగాణ హక్కుల రికార్డుల బిల్లు 2024లో పొందు పరిచిన అంశాలను కలెక్టర్ వివరించారు. పలువురు తెలిపిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు.

## సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

సర్టిఫికెట్లను సర్టిఫికెషన్ చేస్తున్న అధికారి

ములుగు, ఆగస్టు24(నమస్తేతెలంగాణ) : మెడికల్ కాలేజీ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శనివారం పూర్తయింది. ఔట్ సోర్సింగ్ విధానంలో మెడికల్ కాలేజీలో 32 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు మే 15న నోటిఫికేషన్ విడుదల చేసి దరఖాస్తులను స్వీకరించారు. ఆరు విభాగాల్లో 32 ఉద్యోగాలకు 2,191 దరఖాస్తులు రాగా, అధికార పార్టీ నాయకుల పైరవీలతో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని ప్రతికల్లో కథనాలు వచ్చాయి. దీంతో డాటా ఎంట్రీ పోస్టులకు జూలై 11 నుంచి 15 వరకు పస్రాలో టైపింగ్ పరీక్షలు నిర్వహించి, జూలై 27న ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేశారు. ఉద్యోగం రాని కొందరు నిరుద్యోగులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ఆ జాబితాను నిలిపివేసి, ఆగస్టు 10న కలెక్టరేట్‌లో సెలక్షన్ కమిటీ సభ్యులు అభ్యంతాలను స్వీకరించారు. శనివారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, ఇతర అధికారులతో కలిసి అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించారు. సర్టిఫికెట్లలో అవకతవకలు ఉంటే ఎంపిక చేసిన అభ్యర్థులను తప్పించి మెరిట్ లిస్టులో 2వ స్థానంలో ఉన్న వారికి ఉద్యోగాలు కేటాయించే దిశగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

## ఓటర్ల జాబితా సవరణకు అవకాశం : అదనపు కలెక్టర్

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు.

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 24 : ఓటర్ల జాబితాలో సవరణల కోసం ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందని, దీన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ఫొటో వివరాలతో కూడిన ఓటర్ల జాబితాలో సవరణలు చేసుకోవచ్చన్నారు. అక్టోబర్ 29న ఓటర్ల జాబితాను విడుదల చేస్తామని, నవంబర్ 28 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, తుది జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో సవరణల కోసం బీఎల్‌వోలకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. సమావేశంలో డీటీలు అబ్బాస్, ఇమామ్, ఆర్‌ఐ రామస్వామి పాల్గొన్నారు.

## కాటమయ్య కిట్ల పంపిణీ

ములుగురూరల్, ఆగస్టు 24 : బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో శనివారం ఇంచర్ల గౌడ సొసైటీకి చెందిన సభ్యులకు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి కాటమయ్య కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం కిట్లను అందజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్, మొండయ్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పులి శ్రీను, భిక్షపతి, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

## వంతెన పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

వంతెన పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎస్సార్

టేకుమట్ల, ఆగస్టు 24 : టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై జరుగుతున్న వంతెన పునర్నిర్మాణ పనులను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలైలో వరదకు తెగిన వంతెన పునర్నిర్మాణానికి రూ.4.70కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అనుకున్న సమయానికి నాణ్యతతో పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌ను అభినందించారు. సెప్టెంబర్ మొదటి వారంలో వంతెనను ప్రారంభిస్తామన్నారు. అనంతరం మండలంలోని దుబ్యాలలో జరుగుతున్న నల్లపోచమ్మ, ఊరపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీశ్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుదర్శన్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం, కత్తి సంపత్‌గౌడ్, తోట గట్టయ్య, వంగ కుమారస్వామిగౌడ్, శాస్త్రాల కిరణ్, వంగ శ్రీధర్ గౌడ్, ప్రభాకర్, విజేందర్ పాల్గొన్నారు.

## ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 23 : బ్యాంకుల ద్వారా తీసుకున్న ప్రతి రైతు రుణాన్ని మాఫీ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీరా ఫూల్ సింగ్ నాయక్ డిమాండ్ చేశారు. శనివారం భూపాలపల్లి పట్టణంలోని బానోత్ వాడ తండాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీపై ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగ బ్యాంకులు రూ.2లక్షల లోపు రుణాలు మాత్రమే ఇచ్చారని, రైతులు తీసుకున్న అసలుతో పాటు వడ్డీని కూడా మాఫీ చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలు కడితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని బ్యాంకు అధికారులు మోసపూరితమైన మాటలు చెప్పడంతో రైతులు అధిక వడ్డీలకు అప్పు తెచ్చి బ్యాంకుల్లో రుణాలు కట్టారని, రుణాలు మాఫీ కాకపోవడంతో రైతులు అప్పులు తీర్చే పరిస్థితిలో లేరని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్ల రాజరన్న, అజ్మీరా రాజు నాయక్, భూక్యా రామ్‌లాల్ నాయక్, జర్పుల విజేందర్ పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

ములుగురూరల్, ఆగస్టు 24 : న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు వచ్చే నెల 28న జరిగే లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి పోలీసులు కృషి చేయాలని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కన్నయ్యలాల్ అన్నారు. లోక్ అదాలత్ నిర్వాహణ కోసం ఆయన శనివారం కోర్టులో పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాజీపడదగే కేసుల పరిష్కారానికి కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి సౌఖ్య పాల్గొన్నారు.

# మహిళా జర్నలిస్టులపై దాడి హేయం

సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

భూపాలపల్లి రూరల్, ఆగస్టు 23 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి హేయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో అక్కడక్కడా జర్నలిస్టులపై దాడులు చేయడం పరిపాటిగా మారిందన్నారు. రుణమాఫీపై నిజానిజాలు వెలికి తీయాలనే ఉద్దేశంతో కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులు రైతులను సంప్రదిస్తున్న క్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి అండ చూసుకొని వారిపై దాడి చేసి, బూతులు తిడుతూ ఫోన్లు, కెమెరాలను లాక్కొని బీభత్సం సృష్టించడం సరికాదన్నారు. వెంటనే బాధ్యులను అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెండెల దేవ రాజ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేశ్, జిల్లా కార్యదర్శి బచ్చల చిరంజీవి, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి శీలపాక హరీశ్, ఘనపూర్ మండల అధ్యక్షుడు ఈర్ల చిన్ని, భూపాలపల్లి మండల ప్రధాన కార్యదర్శి పసుల కుమార్, నాయకులు నరేశ్, రాకేశ్, ప్రవీణ్, సుమన్ పాల్గొన్నారు.

## హైస్కూల్ విద్యార్థులకు పెళ్లి భోజనాలు

భోజనాలు పెడుతున్న సభ్యులు

మంగపేట ఆగస్టు 24 : మండలంలోని కమలాపురానికి చెందిన యలవర్తి పూర్ణచందర్‌రావు–తేజస్విని వివాహం సందర్భంగా వారి కుటుంబ సభ్యులు స్థానిక జడ్పీ హైస్కూల్‌లోని 250 మంది విద్యార్థులకు శనివారం భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరైనా తమ ఇండ్లలో జరిగే శుభకార్యాలు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి పాఠశాల విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేయాలనుకుంటే ముందుగా సమాచారం ఇవ్వాలని కోరారు. పెళ్లి కుమారుడి కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌రావు, మానస, నాగరాజు, పాఠశాల కమిటీ చైర్మన్ అనిత, జ్వాలా ట్రస్టు బృందం నరేశ్, రాకేశ్, ఉపాధ్యాయులు ప్రసాద్, సునీత, లావణ్య, రమేశ్, నర్సింగరావు, రాజేశ్వర్‌రావు, నాగమ్మ, మౌలి పాల్గొన్నారు.

## బ్యాగుల పంపిణీ

చిట్యాల, ఆగస్టు 24 : మండలంలోని తిరుమలాపూర్, మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సిరి జువెల్లర్స్ వారి ఆధ్వర్యంలో ఎస్సై ఎండీ షాఖాన్ చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, బాటిల్స్, స్టేషనరీ సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. జూలర్స్ యజమాని శానం శివ, హెచ్‌ఎం శ్రీరాం రఘుపతి, నాగరాజు, కట్కూరి నరేందర్, పూర్వ విద్యార్థులు తోట శ్రీకాంత్, నిరంజన్, గోల్కొండ మహేశ్, శివ, జగదీశ్, గేయ రచయిత దాసారపు నరేశ్, అంగన్‌వాడీ టీచర్ రమణమ్మ పాల్గొన్నారు.

## మహదేవపూర్ ఏడీఏగా శ్రీపాల్

మహదేవపూర్, ఆగస్టు 24 : మహదేవపూర్ వ్యవసాయశాఖ డివిజన్ నూతన అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్(వ్యవసాయ సహాయ సంచాలకులు)గా కే శ్రీపాల్ శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏడీఏగా పని చేసిన శ్రీనివాస్‌రాజ్ నిజామాబాద్‌లోని భీంగల్ డివిజన్‌కు బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో శ్రీపాల్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతన ఏడీఏకు వ్యవసాయ అధికారులు, సిబ్బంది శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఏఈవోలు ధర్మేందర్, రచన పాల్గొన్నారు.

## కారులో తరలిస్తున్న మద్యం పట్టివేత

వాజేడు, ఆగస్టు 24 : అనుమతి లేకుండా కారులో తరలిస్తున్న మద్యం సీసాలను పట్టుకొని, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వాజేడు ఎస్సై రుద్రరాపు హరీశ్ తెలిపారు. మండలంలో మండపాక గ్రామం వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై–2 ఇమాన్యుల్ సీఆర్‌పీఎఫ్ పోలీసులతో కలసి శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అయితే, పోలీసులను చూసి ఏటూరునాగారం నుంచి మండపాక వైపు వస్తున్న టాటా జెస్ట్ కారు వేగంగా వెళ్లేందుకు ప్రయత్నించగా అడ్డుకుని తనిఖీ చేశారు. కారులో రూ.82,674 విలువ గల మద్యం సీసాలను పోలీసులు పట్టుకున్నారు. కారు సీజ్ చేసి, మద్యం తరలిస్తున్న ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన ఎగ్గడి తేజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## పోలీసుల అదుపులో ఇద్దరు గంజాయి స్మగ్లర్లు?

వాజేడు, ఆగస్టు 24 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వీఆర్‌పురానికి చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై గంజాయి తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న వాజేడు ఎస్సై రుద్రారపు హరీశ్ సిబ్బందితో కలిసి శుక్రవారం సాయంత్రం మొరుమురులోని ప్రగళ్లపల్లి శివారులో వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసులను చూసి పారిపోతుండగా వారిని వెంబండించి పట్టుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 15 కేజీలకుపైగా ఎండు గంజాయితో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. దీని వెనుక ఎవరెవరు ఉన్నారనే కోణంలో విచారణ చేస్తున్నారు. దీనిపై వాజేడు ఎస్సై హరీశ్‌ను వివరణ కోరగా నిందితులను అదుపులోకి తీసుకున్నామని, పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని తెలిపారు.

## సాయిబాబా ఆలయంలో చోరీ

ఏటూరునాగారం, ఆగస్టు 24 : మండలకేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం తలుపులకు వేసిన తాళం పగులగొట్టి దొంగలు లోపలికి ప్రవేశించారు. ఆలయంలోని పక్క గదిలో ఉన్న బీరువాను తెరిచారు. సాయిబాబా విగ్రహం ఎదుట ఉన్న స్టీల్ హుండీని ఎత్తుకుపోయారు. సమీపంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో హుండీ తాళం పగులగొట్టి కానుకలు తీసుకెళ్లారు. ఉదయం పూజలు నిర్వహించేందుకు వచ్చిన అర్చకుడు భాను ప్రకాశ్ శర్మ గుడి తలుపులు తీసి ఉండడాన్ని గమనించి చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చే యగా ఎస్సై తాజుద్దీన్ వచ్చి పరిశీలించారు. కాగా, గుడికి 500 మీటర్ల దూరంలో ఉన్న మూడు బెల్టుషాపుల్లో కూడా ఇటీవల చోరీ జరిగింది.

# కొను 'గోల్ మాల్'

- తరుగు పేరుతో రైతుల నోటిలో మట్టి
- సొంత ఖాతాలోకి ధాన్యం డబ్బులు
- జంగిడిపల్లిలో వెలుగుచూసిన బాగోతం
- న్యాయం చేయాలని రైతుల డిమాండ్

మల్హర్, ఆగస్టు 24 : భూమిని నమ్ముకున్న రైతన్న ఏదోవిధంగా దగా పడుతూనే ఉన్నాడు.. దుక్కి దున్నిన కాన్నుంచి... పంట చేతికి వచ్చేవరకూ పడరాని పాట్లు పడుతున్నాడు.. చెమటోడ్చి పండించిన పంట సొమ్ము చేతికి వచ్చేదాకా నమ్మకం లేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక.. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే దళారులుగా అవతారమెత్తి రైతులను నిలువునా ముంచుతున్నారు. మల్హర్ మండలం ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జంగిడిపల్లి సెంటర్‌లో ఇలాంటి మోసమే ఆలస్యంగా వెలుగుచూసింది. అధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపితే మరిన్ని ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం విక్రయించిన తర్వాత రైతుల వద్ద నుంచి పట్టాదారు పాస్‌బుక్, బ్యాంకు, ఆధార్ కార్డు జిరాక్స్‌లను నిర్వాహకులు తీసుకొని ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉంటుంది. కానీ, రైతుల అమాయకత్వమే ఆసరాగా చేసుకొని ధాన్యం డబ్బులను తమ సొంత ఖాతాలకు మళ్లించిన ఘటన వివాదాస్పదంగా మారింది. గత యాసంగి సీజన్‌లో మండలంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 10, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 8 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో ఎడ్లపల్లి జీపీ పరిధిలో జంగిడిపల్లి డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో సివిల్ సప్లయ్ అధికారుల లెక్కల ప్రకారం 53 మంది రైతుల వద్ద నుంచి 2929.20 క్వింటాళ్ల ధాన్యం సేకరించి రూ.63,94,443 నగదును రైతుల ఖాతాల్లో జమ చేశారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను దాచి నిర్వాహకుడు ఎక్కువ మొత్తంలో తరుగు పేరిట కోతలు విధించినట్లు తెలిసింది. అటు మిల్లర్లకు తక్కువ తరుగుతో ధాన్యాన్ని పంపించినట్లు తెలుస్తోంది. రైతులు, మిల్లర్లకు మధ్యలో తరుగు పేరుతో కోత పెట్టిన ధాన్యం డబ్బులను సదరు నిర్వాహకుడు తన వ్యక్తిగత ఖాతాతోపాటు తన అనుచరుల ఖాతాల్లో జమ చేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. సదరు నిర్వాహకుడి ఖాతాలో ఆరు విడుతలుగా 324 క్వింటాళ్లకు సంబంధించి రూ.7లక్షలకు పైగా డబ్బులు జమ చేసుకున్నట్లు తెలిసింది. సదరు నిర్వాహకుడికి ఎడ్లపల్లి జీపీలో భూమి ఉన్నట్లు గానీ, కౌలు తీసుకున్నట్లు గానీ లేదు. దళారి ముసుగులో రైతుల వద్ద నుంచి సెంటర్‌లోనే క్వింటాల్‌కు రూ.1800 చొప్పున కొనుగోలు చేసినట్లు తెలిసింది. ఇదే ధాన్యాన్ని మళ్లీ సెంటర్ల ద్వారా మిల్లర్లకు తరలించి డబ్బులు చెల్లింపులో వ్యవసాయ అధికారుల సహకారంతో కొంతమంది రైతుల వద్ద నుంచి భూ మి కౌలుకు తీసుకున్నట్లుగా రికార్డులో నమోదు చేసుకొని మిల్లర్లకు తరలిన ధాన్యాన్ని ట్యాబ్‌లో నమోదు చేసి, సొమ్ము చేసుకున్నట్లు తెలిసింది. కటింగ్ విషయం లో అనుమానం వచ్చిన కొందరు రైతులు నేరుగా మిల్లరు, అధికారుల వద్దకు వెళ్లి చెప్పుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది. రైతుల ధాన్యం డబ్బులను తప్పుదోవ పట్టించి, తన ఖాతాలో వేసుకున్న ఘటనపై అధికారులు విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. రైతుల నోటిలో మట్టి కొట్టిన నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.



వివరాలు లేకుండా ఉన్న ట్రక్ షీట్

### ఇబ్బందులకు గురి చేస్తున్నాడు..

ఎడ్లపల్లి జంగడి పరిధిలోని డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు సెంటర్‌లో 292 బస్తాల ధా న్యం అమ్మిన. 95 క్వింటాళ్లకు మాత్రమే డబ్బులు ఇచ్చాడు. దీంతో సెంటర్ ట్రక్ ఇవ్వమని నిర్వాహకుడు నర్సింహారెడ్డిని అడిగితే సూర్య అని పేరు రాసి, బస్తాలు రాయకుండా కొట్టేసిన ట్రక్ జిరాక్సు ఇచ్చాడు. ఇంకా రూ.70 వేల వరకు డబ్బులు రావాలని అడిగితే మిల్లర్లలో కట్ అయిందని, ఎక్కడ చెప్పుకుంటావో చెప్పుకో అని బెదిరిస్తున్నాడు. డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు పెడుతున్నాడు. చేస్తున్నాడు. ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి సైతం తీసుకెళ్లా.

- సూర్యప్రకాశ్‌రావు, రైతు, ఎడ్లపల్లి, మల్హర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ ప్రముఖ ఫైనాన్స్ సంస్థ యందు ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేయుటకు అనుభవం కలిగిన కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను మరియు హన్మకొండ బ్రాంచిలో పనిచేయుటకు అనుభవం కలిగిన Lady Tele Caller కావలెను. Cell: 8121225656, 8885558638.
NTW-000

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

CHANGE OF NAME

★ I, MOHAMMED MUJAHID ALI (New Name) previously called MOHAMMED MUJAHED ALI (Old Name) H.No. 4-8-52, Kumarpally, Hanamkonda, Hanumakonda Dist-506001. T.S, and solemnly declare.
NTW-000

CHANGE OF NAME

★ I, ABDUL GAFOOR (Old Name) S/o MUNNU MIYA R/o H.No. 9-3-54, Charbowli, Warangal, Warangal Dist.-506002, T.S, Have Changed my name as MUNNU MIYA ABDUL GAFOOR (New Name) and solemnly declare.
NTW-000

PLOTS FOR SALE

★ వరంగల్ నాయుడు పెట్రోల్‌పంప్, వరంగల్ నుండి ఖమ్మం హైవే రోడ్‌కు దగ్గరలో 248 చ.గ.లు Size: 64x35, 33 ఫీట్ల రోడ్ గల ప్లాట్ అమ్మబడును. సంప్ర: 9676147575
NTW-000

★ క్లియర్ టైటిల్ (45W X 54D) వెస్ట్ ఫేస్, LRS & బోర్ సౌకర్యం కలిగిన KUDA ప్లాట్ అమ్మబడును. KU బైపాస్ 100 ఫీట్ రోడ్‌కు 100 మీటర్ల దూరంలో, రెడ్డి కాలనీ, హన్మకొండ. 9348489945.
NT-332518

★ హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీగా మహేశ్వరం, కందుకూరు, ముచ్చర్లలో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు అమ్మబడును. న్యూయార్క్, సింగపూర్‌లా శ్రీశైలం హైవే... Cont: 8008091512.
NT-332632

TO-LET

★ 3 Bed Room Flat in GMR Brindavan, Waddepally, 5th Floor and Car Parking available for Rent. Contact Ph: 9849123115.
NT-331671

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565